

# ధర్మాసుపత్రి

గోపీచంద్

అంతకు ముందు వడ్రంగిపని చేస్తున్న పాపారావుకి కిళ్లీకొట్టు పెట్టాలని బుద్ధి కలగటంలో ఆశ్చర్యంలేదు. తన వాళ్ళంతా వడ్రంగిపని చేస్తున్నమాట నిజమే! కాని ఆ పని ఏడాదికి ఆరు నెలలు మాత్రమే వుంటుంది. మిగిలిన కాలం అంతా వూరికినే వుండవలసిందే ... కిళ్లీకొట్టయితే! తన ఇంటి పక్కనవున్న నరసయ్య కిళ్లీకొట్టు మీద ఇప్పటికి ముప్ఫయి వేలు సంపాదించాడు.

ఈ ఉద్దేశం కలగ్గానే పాపారావు ఆ వూరుపంచాయతీబోర్డు ప్రెసిడెంటును కలుసుకున్నాడు. అయన ప్రాపకంతో నలుగురూ కూడేచోట కాస్త స్థలం సంపాదించి కిళ్లీకొట్టు పెట్టాడు. ఎట్లా లేదన్నా నెలకు డెబ్భయి ఎనభై రూపాయలు మిగిలేవి. కొంతకాలం నిర్విచారంగా గడిచిపోయింది. ఒకనాడు దురదృష్ట వశాత్తూ సోడాబుడ్డి ఒకటి పగిలి కంటికి ప్రమాదం జరిగింది. వెంటనే ఊళ్ళోవున్న డాక్టరుతో మందు వేయించాడు గాని, నయమవలేదు. కాయ కాచింది. పైగా ఆ డాక్టరు త్వరలో ఆ గుడ్డు తీయించివెయ్యకపోతే, రెండోకంటికి కూడా ప్రమాదం జరుగుతుందని చెప్పాడు. ఆ మాట వినగానే పాపారావుకి ప్రపంచం అంతా అంధకార బంధురం అయింది. వెనక జీవితం వొక్కసారి కళ్ళకు కట్టినట్టయింది. భారతదేశంలో ఎక్కడికి వెళ్ళినా, ఎటుచూచినా వినబడే కేక వొకటి ఉంది. అది వినబడింది- "కళ్లు లేని కబోదిని బాబూ."

"కన్ను తీయించుకోవాలంటే డాక్టర్లు ఇక్కడ లేరట్రా" అని గోడు పెడుతున్న తండ్రిమాటను కూడా

పాటించకుండా మద్రాసు బయలు దేరాడు.

## 2

మద్రాసులో పాపారావుకి వొక స్నేహితుడున్నాడు. అతడు సినిమాల్లో జేరాలని వొచ్చాడు. అతని సహాయంతో వొక వైద్య విద్యార్థిని పరిచయం చేసుకుని ఆయనద్వారా ధర్మాసుపత్రికి వెళ్ళాడు ... అక్కడి డాక్టరుతో జరిగిన సంగతంతా చెప్పాడు. ఆ డాక్టరు సరిగ్గా చూచీ చూడకుండానే ... "ఇంకా ముదర లేదు; రెండు నెలలుండి రా" అన్నాడు.

"మా వూళ్ళో డాక్టరు ఆలస్యం అయితే రెండోకంటికూడా ప్రమాదం వొస్తుందని చెప్పాడండీ" అని నసిగాడు పాపారావు.

"అయితే అక్కడే చేయించుకోక పోయావ్?" అని కోపగించుకున్నాడు డాక్టరు.

"తమరు గొప్ప డాక్టర్లని..."

"ఇంకేం? నా మాట నమ్మి ... కన్ను యిప్పట్లో ఆపరేట్ చెయ్యటానికి వీల్లేదు."

"తమరు ఇంకొకసారి చూసి ..."

"అక్కడ చూట్టానికేముంది ?" అని విసుక్కున్నాడు డాక్టరు ... అంతే. పాపారావు నిర్విణ్ణుడయ్యాడు.

యింటికి తిరిగి వొచ్చేటప్పుడు తన బాధ - తనకు సహాయంగా వొచ్చిన వైద్య విద్యార్థితో చెప్పుకున్నాడు -


"మీ వూళ్ళో డాక్టరు చెప్పిన మాటే నిజం అయివుంటుంది. నా అభిప్రాయం కూడా వెంటనే ఆపరేట్ చెయ్యకపోతే రెండో కంటికూడా ప్రమాదం జరుగుతుందనే" అన్నాడు.

"మరి ఈ డాక్టరుగారు ..."

"ఈ డాక్టరు పెద్దడాక్టరే కాని ఉచితవైద్యం అవటంవల్ల పనిలో ఆయనకు ఇంట్రెస్ట్ పోయింది ... వీలైనంతవరకు పని తగ్గించుకొని యింటికి వెళ్ళాలని చూస్తుంటాడు."

ఆ రాత్రి పాపారావుకి నిద్రపట్ట లేదు. తన రెండోకన్ను పోయే వీలున్నా డాక్టరు ఇంత నిర్లక్ష్యం చేశాడు. ఆస్పత్రిలో పనిచేస్తున్నందుకు ఆయనకు జీతం వొస్తూనేవుందె. పోనీ తనకు ఏదో చిన్న జబ్బుకాదాయె. శాశ్వతంగా గ్రుడ్డివాడయిపోవటం? చచ్చేవరకూ ప్రపంచం పూర్తిగా కనపడకుండాపోవటం! బ్రతికినన్నాళ్ళూ గాఢాంధకారంలో బ్రతకటం. డాక్టరు ఇంత నిర్లక్ష్యం ఎలా చెయ్యగలిగాడు. ఒకవేళ యీ డాక్టరుగారు చెప్పిందే నిజమేమో! నిజంగానే ఆపరేషన్‌కి యింకా కొన్నాళ్ళు ఆగాలేమో !

ఈ అనుమానాలే తన స్నేహితుడికి చెప్పాడు. అతను, "ఇంకొక డాక్టరుకి చూపిద్దాం" అన్నాడు.




## 3

మర్నాడు ఆ వైద్యవిద్యార్థి సహాయంతో యింకొక ఆస్పత్రికి బయలుదేరాడు. అదీ ధర్మాసుపత్రే. కాని ఆ డాక్టరు మంచివాడుగా కనుపించాడు. మర్యాదగా మాట్లాడి, శ్రద్ధగా పరిశీలించి, వెంటనే ఆపరేషన్ జరగాలని చెప్పాడు. ఆస్పత్రిలో చేర్పించాడు. ఆపరేషన్ పూర్తి అయింది. పుండు నయం అయ్యేదాకా ఆస్పత్రిలోనే వుండాలన్నాడు డాక్టరు. వైద్య విద్యార్థి, ఆపరేషన్ దిగ్విజయంగా జరిగిందనీ, నాలుగయిదు రోజుల్లో డిశ్చార్జి చేస్తారనీ, భయపడవలసిన అవసరంలేదనీ ధైర్యంచెప్పి వెళ్ళాడు. మళ్ళీ మర్నాడు కలుసుకుంటానన్నాడు.

మద్రాసు వచ్చిన ఇన్నాళ్ళకు పాపారావుకి సంతోషం కలిగింది. కాని యెంతసేపు? రోగుల గదిలో అడుగు పెట్టేటప్పటికి గుండె గుభేలుమన్నది. రోగుల మంచాలు వరుసగా వున్నాయి. అందరూ కంటిజబ్బువాళ్ళే. రకరకాల కట్లు, రకరకాల ఆకారాలు. గదిమధ్య అలాగే నుంచొని పోయాడు పాపారావు.

"రూపాయి పావలా యిచ్చుకోండి" అన్నాడు వెంట వచ్చిన వార్డర్ బాయ్.

"ఎందుకు?" అడిగాడు వెంటవున్న తన స్నేహితుడు.

"ఇక్కడ వుండటానికి ఫీ'' అన్నాడు వార్డర్ బాయ్ - ఈ

మాత్రం తెలియనివాళ్ళు యిక్కడికి యెట్లా వొచ్చారు ? అన్నట్లు.

"చేర్చమని డాక్టరు నీతోనే చెప్పాడుగా" అన్నాడు తన స్నేహితుడు.

"చెప్పారు ... సరిపాయె ...అడ్మిషన్ ఫీ ఇవ్వటానికేమిటయ్యా మీ పేచీ ... మొహామొహాలు చూసుకుంటారు ?" అని విసుక్కున్నాడు వార్డ్ బాయ్. ఎందుకొచ్చిన గొడవ అని ఇచ్చివేశాడు పాపారావు ఎంత ధర్మాసుపత్రి అయితే మాత్రం ఈ మాత్రం ఇచ్చుకోవలసి వుండికూడా వుంటుందా అనుకున్నాడు పాపారావు. ఆ వార్డ్ బాయ్ మరొకరికి అప్పగించి వెళ్ళిపోయాడు.

"అరున్నర ఇవ్వండి" అన్నాడు రెండో అతను. పాపారావు గానీ, అతని స్నేహితుడుగానీ ఈసారి 'ఎందుకు ?' అని అడగటానిక్కూడా భయపడ్డారు. వార్డరు అడిగీ అడగ్గానే దగ్గర్లోవున్న రోగులు మొదలుపెట్టారు—

"మేమందరం యిచ్చుకోలా ?"


"లేకపోతే మంచంగించం దొరక మంటే ఎట్లా దొరుకుతుంది ?"

"ఆ మాటకొస్తే వొక్కపని జరుగుతుందా ? అతను చెప్పకుండా డాక్టరు వొక్క అడుక్కూడా వెయ్యడు."

"ఒకవేళ రేపు కంటికేదన్నా ప్రమాదమే వొచ్చిందనుకో ..."

ఇక ఆ మాటలు వినలేకపోయాడు పాపారావు. అరున్నరా చెల్లించుకున్నాడు. నాలుగురోజులయింతర్వాత డాక్టరు అతన్ని డిశ్చార్జి చేశాడు. ఒక చీటీ వ్రాసియిచ్చి, ఒక నెలరోజులయింతర్వాత ఫలానా కొట్టుకు వెళ్తే గాజుకన్ను పెడతారని చెప్పాడు. తన స్నేహితునితోనూ, వైద్యవిద్యార్థితోనూ ఆసుపత్రినుంచి బయటపడ్డాడు పాపారావు. ఇంటికి వెళ్ళేటప్పుడు పాపారావు యథాలాపంగా ఆసుపత్రిలో జరిగిన సంగతులను వైద్యవిద్యార్థితో చెప్పాడు. అతను, "అక్కడ వొక దమ్మిడీ యివ్వవలసిన పనిలేదు. మిమ్మల్ని అమాయకుల్ని చేసి మీ దగ్గర డబ్బు కాజేశారు" అని చెప్పి తన స్నేహితునితో "ఇదేమిటోయ్ ... నువ్వుండి కూడా యిలా చేశావ్ ?" అని అడిగాడు. తన స్నేహితుడు ఈవిధంగా జవాబు చెప్పాడు. "నువ్వు చెప్పేది నిజమేనోయ్. కాని వాళ్ళడిగిన డబ్బివ్వకపోతే అక్కడ వొక్క క్షణంకూడా వుంటానికి వీలున్నట్లు లేదు. పై అధికారులకు రిపోర్టు చేద్దాం అంటే అంతా కలిసే చేస్తున్నట్టు కనిపించింది ... ఇక రభస జరగటం దేనికని ఊరుకున్నాను."

డబ్బు కాస్త ఖర్చయినా, వొచ్చిన పని సక్రమంగా జరిగిందని వైద్య విద్యార్థి సంతోషించాడు.




## 4

ఆ నెలరోజులూ మద్రాసులోనే వుండిపోయాడు పాపారావు. తండ్రి, "వెళ్ళి అక్కడే కూర్చున్నావు ! నాకిక్కడ యింటిపనికి, కోర్టుమీదకు వెళ్ళటానికి తూగటంలేదు" అని ఉత్తరం వ్రాసినా, ఇంతలో వెళ్ళి రావటం ఎందుకని వెళ్ళలేదు పాపారావు. కాలక్షేపానికని తన స్నేహితునితో అక్కడికీ ఇక్కడికీ వెళ్ళొస్తుండేవాడు. మద్రాసు వాతావరణం అతనికి గిట్టలేదు. ఎక్కడికి వెళ్ళినా ఎవరో ఒకర్ని నిందించుకోవటం వొకరిమీద వొకరు అపవాదులు వేసుకోవటం, డబ్బుకోసం ఏ పనైనా చెయ్యటానికి సిద్ధపడటం తప్ప మరేమీ కనిపించలేదు. అతనికి విసుగుపుట్టింది. ఉండటం కష్టం అనిపించింది. 'నెల రోజులు చిటికలో వొస్తయ్' అనుకున్న పాపారావుకి గాజుకన్ను పెట్టే రోజు అతిభారంగా దగ్గరకు వొచ్చింది. ఆ రోజు తన స్నేహితుణ్ణీ, వైద్యవిద్యార్థినీ తీసుకొని డాక్టరు చెప్పిన కోట్టుకి వెళ్ళాడు...నాలుగున్నర రూపాయి ఇచ్చి గాజుకన్ను ఒకటి కొన్నాడు. 'కన్ను పెట్టటం మాకు చేతకాదు. మా డాక్టరుగారు వొచ్చేవరకూ వుండండి' అని కోట్టువాళ్ళు చెబితే అక్కడే కూచున్నాడు. కాసేపటికి డాక్టరు వొచ్చాడు. ఆ డాక్టరు తనకు ఆపరేట్ చేసిన డాక్టరే. వొచ్చినప్పటినుంచీ తన్ను ఎరుగనట్లే ప్రవర్తించాడు.

"ఆపరేట్ చేయించి ఎన్నాళ్ళయింది ?"

"నెలరోజు అయింది" అని చెప్పాడు వైద్యవిద్యార్థి.

"ఎవ్వరిదగ్గర చేయించారు ?"

"మీరేగదండీ చేసింది" అని చెప్పి ఆయన వ్రాసియిచ్చిన రసీదు చూపించాడు వైద్యవిద్యార్థి.

"ఓహో!" అన్నాడు డాక్టరు. అంతే. ఇక కదలడు, మెదలడు. పాపారావుకి ఆశ్చర్యంవేసింది. డాక్టరు మరొకరితో మాట్లాడుతూ కూచున్నాడు. కొట్టతను వాళ్ళని లోపలకు పిలిచి, "కన్ను పెట్టినందుకు పదిహేను రూపాయి లివ్వాలి" అన్నాడు.

"ఆపరేషన్ చేసింది ఆయనే" అన్నాడు తన స్నేహితుడు.

"ధర్మాసుపత్రిలో డాక్టరుగా ఆపరేట్ చేశారు. అందుకని మీ దగ్గర డబ్బు పుచ్చుకోలేదు. ఇప్పుడు గాజు కన్ను పెట్టడం తమ వ్యక్తిగత హోదాలో చేస్తున్నారు. కాబట్టి మీరు పదిహేను రూపాయి లిచ్చుకోవాలి" అన్నాడు.

"ఈ పనికూడా ఆసుపత్రిలోనే చేయించుకుంటే ..." అని అడిగాడు తను.


"అక్కడైతే ఉచితంగానే చేస్తారు."

"అయితే అక్కడే చేయించుకుంటాను" అన్నాడతను.

"చేయించుకో."

పాపారావు యింటికి వొచ్చాడు... మనస్సులో చాలా బాధగా వుంది. ఇంటిదగ్గరనుంచి అతను బయలుదేరినప్పుడు మద్రాసు ఆసుపత్రులన్నా, వైద్యులన్నా ఒక అభిప్రాయం ఉండేది. తాను మద్రాసు వస్తేచాలు తన కంటివిషయం జరగవలసిందంతా సక్రమంగా జరిగిపోయినట్లే అనుకున్నాడు. కాని ఇక్కడ పరిస్థితులు అలాలేవు. యెవరిమట్టుకు వారికి తమ సంపాదనకు తన కన్నొక సాధనం. ఆపదలో ఉన్న వ్యక్తి ఒకడు దొరకనే దొరికాడు. ఆ వ్యక్తి తమ చేతుల్లోనుంచి తప్పించుకొనేలోగా యెంత సంపాదించగలం అనే తాపత్రయమే తప్ప ఒక వ్యక్తి శాశ్వతంగా గ్రుడ్డివాడై పోతున్నాడే ... ఒక వ్యక్తి జీవితం శాశ్వతంగా అంధకారబంధురం అయిపోతూవుందే అనే ఆవేదన ఎవ్వరికీ ఉన్నట్టు కనుపించదు. ఆలోచించిన కొద్దీ అతనికి మరీ అనుమానా లెక్కువైనై ... తన కన్ను నెపంతో పదిహేను రూపాయలు సంపాదిద్దామని గదా డాక్టరు గాజుకన్ను ఆసుపత్రిలో పెట్టకుండా సొంత కొట్టుకు రమ్మన్నాడు. పదిహేను రూపాయలకు యిటువంటి పనికి పూనుకున్న మనిషి మళ్ళీ తను ఆస్పత్రికి వెళితే పని సరిగ్గా చేస్తాడా ? డబ్బివ్వక మళ్ళీ ఇక్కడకు

కొందరికి కొన్ని జీవితంలో లేటుగా జరుగుతాయి - హనీమూన్ కెళ్ళుతున్నాం



వొచ్చాడనే కోపంతో తన కంటినేం చేస్తాడో !!

ఈ అనుమానం పాపారావు తన స్నేహితునితో చెప్పాడు.

"ఆఁ అలా చెయ్యడు," అన్నాడు తన స్నేహితుడు.

"ఎందుకు చెయ్యడు... నా కన్ను బాగుపడటంకంటే తనకు వొచ్చే పదిహేను రూపాయిలు ముఖ్యమను కున్న మనిషి యెందుకు చెయ్యడు ?"

దీనికి తన స్నేహితుడు జవాబు చెప్పలేకపోయాడు — "పోనీ ఇంకొక డాక్టరుతో పెట్టిద్దాం" అన్నాడు.

ఇందుకు పాపారావు ఒప్పుకో లేదు ... అతనికి మనుషుల్లో నమ్మకం పూర్తిగా పోయింది. ఆపరేషన్ తన దగ్గర చేయించుకోకుండా, ఇంకొకరి దగ్గర చేయించుకున్నాడనే కోపంతో ఈ డాక్టరు సరిగ్గా చెయ్యకపోతే?... మళ్ళీ వొస్తే, మళ్ళీ డబ్బు పుచ్చుకో వొచ్చనే కోరికతో చెయ్యటంలో ఏదన్నా లోపం చేస్తే? తాను మద్రాసు చుట్టూ ఎన్నిసార్లు తిరగాలి ?

"నా కిక్కడ వైద్యం ఇక వొద్దు ... గాజుకన్ను పెట్టటమే గద. మన వూళ్ళో డాక్టరుతోనే పెట్టించు కుంటాను," అన్నాడు.

"అతను మాత్రం సరిగ్గా చేస్తాడనే నమ్మకం ఏమిటి ?" అడిగాడు తన స్నేహితుడు.

"ఎప్పుడూ ఎదురుగా కనపడే వాడు. బాగా చెయ్యకపోతే ఏమం

టామో అనే భయమన్నా ఉంటుంది. ఏమన్నా జరిగినా మాటిమాటికీ మద్రాసుచుట్టూ తిరగవలసిన అవసర మన్నా తప్పుతుంది," అన్నాడు తను.

ఇన్నాళ్ళు మద్రాసులో వుండి, ఇంత డబ్బు ఖర్చుపెట్టుకొని తీరా కన్ను కట్టించుకోకుండా వెళితే బాగుం డదనీ, ఇంట్లోవాళ్ళూ ఊళ్ళోవాళ్ళూ డబ్బు దుబారా చేశావని నిందిస్తారనీ, తను అనుకున్నంత దుర్మార్గం జరగ దనీ, స్నేహితుడు ఎంత చెప్పినా పాపారావు వినలేదు. ఇక వొక్క రోజుకూడా మద్రాసులో ఉండనని చెప్పి, ఆనాడే ప్రయాణంకట్టి తన ఊరు వెళ్ళిపోయాడు.

* * *

అతను వెళ్ళిపోయిన చాలా రోజుల వరకూ పాపారావు సంగతి ఏమీ తెలియలేదు అతని స్నేహితునికి. మొదట ఉత్తరంకోసం కొన్నాళ్ళు నిరీక్షించాడు గాని క్రమక్రమేణా తన సినిమా గొడవల్లో పడి, ఆ విషయమే మరిచిపోయాడు. ఒకనాడు తన స్నేహితుడు మరొకడు మద్రాసువస్తే అతన్ని అడిగి పాపారావు సంగతి తెలుసుకున్నాడు. అతడు చెప్పాడు... మద్రాసునుంచి వొచ్చి రాగానే ఊళ్ళో వున్న డాక్టరుతో గాజుకన్ను పెట్టించుకున్నాడట. అది సరిగ్గా పెట్టటం చేతగాకపోవటంవల్ల వుండై, సెప్టిక్ అయి చివరికి రెండోకన్ను కూడా పోయి, "కళ్ళులేని కబోది" అయ్యాడట. ప్రస్తుతం కస్సుబుస్సు మంటూ కదిలించిన ప్రతి వాళ్ళనీ నానా దుర్భాషలూ ఆడుతూ, తన జీవితం - తనచుట్టూ వున్నవాళ్ళ జీవితం నరకంచేస్తూ బ్రతుకు వెళ్ళబోసుకుం టున్నాడట ...

